విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999


# చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక


## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

### ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపిన చంద్రబాబు



**అమరావతి,మే18 చట్టం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వీడన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ప్రదానం చేసింది. ఈ పురస్కారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీకి

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 • సంచిక : 125 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 19 మే 2026 • పేజీలు : 8 • వెల 2/-

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ,మే18 చట్టం న్యూస్:** భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్,

మిగతా 2వ పేజీలో..



## నదుల అనుసంధానానికి ఆద్యుడు కె.ఎల్.రావ్

- పట్టిసీమ 5ఏళ్ళలోనే 50వేల కోట్ల సంపద సృష్టించింది.
- కె.ఎల్. రావ్ వర్ధంతి వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి,మే18 చట్టం న్యూస్:** భారతదేశ నీటిపారుదల చరిత్రను మార్చిన హీరాకుడ్, భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి బహుళార్ధక సాధక ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. సోమవారం అమరావతి సచివాలయంలో పద్మభూషణ్

మిగతా 2వ పేజీలో..

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

### ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**



**తిరువనంతపురం,మే18 చట్టం న్యూస్:** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం

మిగతా 2వ పేజీలో..

# బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

### సిఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ



**అమరావతి,మే18 చట్టం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బు÷-లలెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్‌కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్‌లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ఎ÷-లాంట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ఎ÷-లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్

మిగతా 2వ పేజీలో..

## ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర పరిష్కారం

- జైళ్లను సంస్కరించి ఆధునీకరిస్తున్నాం
- రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత
- కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం



**తిరుపతి,మే18 చట్టం న్యూస్:** రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను

మిగతా 2వ పేజీలో..

# బండి భగీరథపై అదనపు సెక్షన్లు

### మరింత పకడ్బందీగా కేసు విచారణ

**హైదరాబాద్,మే18 చట్టం న్యూస్:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్

మిగతా 2వ పేజీలో..



## కేరళం మరింతగా పురోగమించాలి

### సిఎం సతీషన్, మంత్రులకు పవన్ అభినందనలు

**అమరావతి,మే18 చట్టం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళం కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. కేరళం నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పారదర్శకమైన, ప్రగతిశీలమైన పాలనను అందిస్తూ కేరళం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేవుని సొంత దేశంగా పేరుగాంచిన కేరళం మరింత అభివృద్ధి, సుసంపన్నత సాధించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

## వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

- మూడు పోర్టుల పనులు ఏడాది చివరికి పూర్తి
- అధికారులతో సమీక్షలో మంత్రి జనార్ధన్ రెడ్డి



**అమరావతి,మే18 చట్టం న్యూస్:** గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని తెలిపారు.పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తయ్యే

మిగతా 2వ పేజీలో..

## తిరుమలలో పెరిగిన అటవీ విస్తీర్ణం

### టిటిడికి సిఎం చంద్రబాబు అభినందనలు



**అమరావతి,మే18 చట్టం న్యూస్:** తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం

మిగతా 2వ పేజీలో..

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఎపి అగ్రగామి

### న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ

### యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్




**న్యూఢిల్లీ,మే18చట్టం న్యూస్ :** ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్

మిగతా 2వ పేజీలో..

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

### ముస్లింలకు సిఎం యోగి ఆదిత్యానాథ్ హెచ్చరిక



**లక్నో,మే18 చట్టం న్యూస్:** ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన

మిగతా 2వ పేజీలో..

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం





మొదటి పేజీ తరువాయి..

20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఎపి అగ్రగామి

మొదటి పేజీ తరువాయి..

ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు,




మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తృతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్ఠాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్స్‌నిక్ హాజరయ్యారు.

## మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

మొదటి పేజీ తరువాయి..

యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి..

లభించిన ఈ గౌరవం భారతదేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్వీడన్ ప్రభుత్వం అందించిన 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారం ప్రధాని మోదీకి లభించిన 31వ అంతర్జాతీయ గౌరవమని ప్రస్తావించారు. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా భారతదేశానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా సీఎం అభివర్ణించారు.

## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ



మొదటి పేజీ తరువాయి..

ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ త్వరలో 'ఫ్లైయింగ్ ఫ్లీ అ6' పేరుతో ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు.



## బండి భగీరథపై అదనపు సెక్షన్లు

మొదటి పేజీ తరువాయి..

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయ

## తిరుమలలో పెరిగిన అటవీ విస్తీర్ణం

మొదటి పేజీ తరువాయి..

అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## పాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర పరిష్కారం

మొదటి పేజీ తరువాయి..

ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాజాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అంతుకుముందు తిరుమల శ్రీవారిని అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన టిటిడి అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదాశీర్వచనం చేశారు.

## వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

మొదటి పేజీ తరువాయి..

అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని దిశానిర్దేశర చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో పాటు, ఫేజ్1 ఫిషింగ్ హార్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు.

## నదుల అనుసంధానానికి ఆధ్యుడు కె.ఎల్.రావ్

మొదటి పేజీ తరువాయి..

డాక్టర్. కె.ఎల్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్. కె.ఎల్ రావు సేవలు అందరికీ స్ఫూర్తి దాయకం, ఆదర్శనీయం అని అన్నారు. ఈ రోజు అందరం మాట్లాడుకుంటున్న నదుల అనుసంధానం గురించి, దేశంలో మొదటి సారిగా ప్రతిపాదించిన వ్యక్తి కె.ఎల్.రావు అని అన్నారు. అందుకే ఆయన మనకు ఒక స్ఫూర్తి అని మంత్రి నిమ్మల తెలిపారు. దేశంలో కరువు కాటకాలు పోవాలంటే నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని, గంగా, మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి, వంటి నదుల అనుసంధానంతోనే సాధ్యమౌతుందని ప్రగాఢంగా నమ్మిని వ్యక్తి కె.ఎల్ రావు అని అన్నారు. కె.ఎల్ రావు స్ఫూర్తిని నాడు వాజ్‌పేయ్, నేడు ప్రధాని మోధీ అందిపుచ్చుకున్నారని, ముఖ్యంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పట్టి సీమ నిర్మాణం ద్వారా గోదావరి నుండి కృష్ణాకు గోదావరి జలాలను తరలించి నదుల అనుసంధాన కార్యక్రమానికి భీజం వేశారని తెలిపారు. నాడు 1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 5ఏళ్ళలోనే 50వేల కోట్ల ఆదాయం సృష్టించిందని స్పష్టం చేశారు. భవిష్యత్ లో కూడా కె.ఎల్ రావు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేలా, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, జలవనరుల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, సిఈలు,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

మొదటి పేజీ తరువాయి..

ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది క లిగించవద్దని హెచ్చరించింది.

## విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఘన సన్మానం చేసిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు



**మహబూబ్ నగర్ 18 మే 2026 ( చట్టం న్యూస్) :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణం ఏటీఆర్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ భారతీయ మస్తూర సంఘ అధ్యక్షులుగా ఎన్నికైన పి రవికాంత్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎద్దుల సత్యం రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ వరదరాజు లకు కొత్తకోట టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్ గౌడు మాజీ సి డి సి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి మాజీ కౌన్సిలర్ చింతలపల్లి సంధ్యా రవీందర్ రెడ్డి అయ్యన్న గాడిల ప్రశాంత్ ముంతా మంజుల రామకృష్ణ యాదవ్ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు డాక్టర్ సాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో సంచలన తీర్పు....

- పది మంది నిందుతులకు యావజ్జీవకారాగార(జీవిత ఖైదు) శిక్ష.
- నేరం చేస్తే శిక్షలు తప్పవు,శిక్షలతోనే సమాజంలో మార్పు.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే.

**బోయిన్ పల్లి మండలం / మే 18 ,( చట్టం బ్యూరో ) :** బోయినపల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన హత్య కేసులో పది(10) మంది నిందుతులకు యావజ్జీవకారాగార (జీవితఖైదు) శిక్ష,ఒక్కొక్కరికి 6500/- రూపాయల జరిమాన విధించినట్లు సోమవారం రోజున సిరిసిల్ల జిల్లా ప్రధాననాయమూర్తి నీరజ కీలక తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.

**కేసు వివరాలు....**

బోయినపల్లి మండలం స్థంబంపల్లి గ్రామానికి చెందిన తునికి లక్ష్మీనారాయణకి ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు అయినటువంటి మహేష్ అదే గ్రామానికి చెందిన బొంగానీ పరిశరాములు యొక్క కూతురు ఒకరికొకరు ప్రేమించుకున్నారు.ఇట్టి విషయం నచ్చని అమ్మాయి వాళ్ళ కుటుంబ సభ్యులు మరియు బంధువులు( పది మంది) కలిసి



అబ్బాయి వల్ల ఇంటి మీదకి గొడవకి పోయి అబ్బాయి కుటుంబ సభ్యులను కట్టెలతో రాడ్ లతో మరియు చేతులతో కొట్టగా అబ్బాయి తండ్రి అయినటువంటి తునికి లక్ష్మీనారాయణకి బాగా గాయాలు అయ్యి చనిపోయాడు.ఇట్టి కేసులో మృతిని భార్య అయిన తునికి విజయ పిర్యాదు మేరకు బోయినపల్లి ఎస్.ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి పది మంది నిందుతులను రిమాండ్ కి తరలించారు.

అప్పటి వేములవాడ రూరల్ సీఐ నవీన్ కుమార్ గారు కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా,ఈకేసు విచారణ దశలో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సరేష్ కుమార్ , రాజేంద్ర ప్రసాద్ , కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 20 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ గారు వాదించారు.శాస్త్రీయ ఆధారాలు మరియు సాక్ష్యాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో 10 మంది నిందుతులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి 6500/- రూపాయల జరిమానా విధించడం జరిగింది.

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

పై కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పీపీలు పెంట శ్రీనివాస్, అప్పటి ,ప్రస్తుత సి.ఐ లు నవీన్ కుమార్, శ్రీనివాస్, సిఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, బోయినపల్లి ఎస్ ఐ రమాకాంత్,కోర్ట్ మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,కోర్టు కానిస్టేబుల్ సరేష్ , రాజేంద్ర ప్రసాద్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై 'బిఆర్ఎస్' పార్టీ నాయకుల నిరసన

### తహసీల్దార్‌కు ఫోన్ చేసిన బిఆర్ఎస్ నేత రామడుగు రాజేష్

**వెల్గటూర్,మే 18 (చట్టం):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పలు వడ్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ తీవ్ర జాప్యమవడాన్ని నిరసిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఎండపెల్లి మండల పరిధిలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రామడుగు రాజేష్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యంతో వేచి చూస్తున్న రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముంజంపల్లి కొనుగోలు కేంద్రం నుండే రైతుల సమక్షంలో రామడుగు రాజేష్ ఎండపల్లి తహసీల్దార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో హమాలీల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల లోడింగ్ ఆలస్యమవుతోందని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, ఇక్కడి నుండి లోడ్ అయిన లారీలు రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ కాక రోజుల తరబడి నిలిచిపోతున్నాయని, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు.

**రైతులను నిలువు దోపిడీ చేస్తే ఊరుకోం:**

వడ్ల కొనుగోలులో తరుగు పేరుతో కొందరు అధికారులు, మిల్లుల నిర్వాహకులు అదనపు కటింగ్ (క్వింటాకు ఎక్కువ కిలోలు తూకం వేయడం) చేస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రామడుగు రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు ఎలాంటి అదనపు కటింగ్ లేకుండా మద్దతు ధర దక్కేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాతలు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడటం దురదృష్టకరమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోతే రైతుల పక్షాన ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# జన జాతీయ గరిమా ఉత్సవం పోస్టర్ల ఆవిష్కరణ





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 18 ,(చట్టం బ్యూరో) :** గిరిజన మంత్రిత్వ శాఖ ప్రభుత్వం జన జాతీయ గరిమా ఉత్సవం 2026 (జన భాగధారి అభియాన్ ) కింద జిల్లాలోని వీర్నపల్లి మండలంలో మద్దిమల్ల, గర్జనపల్లి గ్రామాలను అలాగే రుద్రంగి మండలం మానాల గ్రామమును ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా అవగాహన కల్పించేందుకు ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆయా గ్రామాలగిరిజన ప్రజలు ఈ ప్రత్యేక క్యాంపులలో ఆధార్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి. కిసాన్ క్రెడిట్ కార్డ్, పీ ఎం జన ధన యోజన, అటవీ హక్కుల చట్టం పట్టా, రేషన్ కార్డ్, కుల ధ్రువ పత్రం, ఆరోగ్య సేవలు, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చేయడం ముఖ్య ఉద్దేశం.

ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జన జాతీయ గరిమా ఉత్సవం 2026 (జన భాగిదారి అభియాన్) ను పోస్టర్లను ఆవిష్కరించారు. వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల తండా, సీతారామ నాయక్ తండా, జవహర్ లాల్ నాయక్ తండా, రుద్రంగి మండలంలోని వీరుని తండా, అడ్డబోర్ తండా, డేగావాత్ తండా, గాయిదిగుట్ట తండా, రుష్టా నాయక తండా, సర్పంచ్ తండా, మానాల, బడి తండా, చింతామణి తండాలలోని గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పోస్టర్ల..**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా టూరిజం, హెరిటేజ్ అండ్ లాంగ్వేజ్ కల్చర్ పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ జి నగేష్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసాచారి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ తో కలిసి ఆవిష్కరించారు.

# ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 19 చట్టం ప్రతినిధి :

### "రక్తపోటును నియంత్రించండి.. జీవితాన్ని ఆనందించండి" అంటూ ప్రజలకు వైద్యుల సూచనలు

**ఆగిరిపల్లి మే 17 :** ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి, ఈదర, సద్గూరు గ్రామాల్లో ప్రజలకు రక్తపోటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. "రక్తపోటును నియంత్రించండి -- జీవితాన్ని ఆనందించండి", "క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్ష చేయించుకుందాం", "కలిసికట్టుగా రక్తపోటును నియంత్రిద్దాం" అనే నినాదాలతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ




కార్యక్రమంలో డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ టీనా, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యాప్రియతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, రోగులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని ప్రజలకు వివరించారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు రక్తపోటు లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కే. శుభశేఖర్ మరియు పోలీస్ సిబ్బందికి డాక్టర్ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. అవసరమైన మందులను కూడా పంపిణీ చేశారు.


## శుభకార్యాలకు అనువు కాదు

### అధిక జేష్ఠ్యం..ఆరంభం

**తిరుపతి,మే18 :** ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు.

# అసంతృప్తి పడుతున్న కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త

### (20) సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం వెల్గటూర్ గ్రామంలో గత ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ లో కార్యకర్తగా ఉంటూ.. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డ విషయం మీ అందరికి సుపరిచితమే.. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఆదేశాల మేరకు గత సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉన్నపటికీ మంత్రి గారి హామీ మేరకు పోటీ నుండి తప్పుకుని పార్టీ గెలుపు కోసం కష్టపడ్డాను. నేడు వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డ సీనియర్ కార్యకర్త గా నేను ఆశిస్తున్నాను.నా ఈ ప్రయత్నానికి మీ వంతు సహకారంగా అధ్యక్ష పదవి రేసులో నేను ఉన్నానని,పార్టీ కోసం చేసిన పనులను తెలియజేస్తూ నన్ను మండల అధ్యక్ష పదవిలో ముందంజ లో ఉండేలా మీ మీ ప్రజల ఆశీస్సులతో సహకరించాలని మనవి చేసుకుంటున్నాను. ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉండే కాంగ్రెస్ కార్యకర్త మీ, మెరుగు నరేష్ కుమార్ గౌడ్,

## ఈత చెట్లు దగ్ధం

**రాయికల్ మే 18 చట్టం :** మండలంలోని ఇటిక్యాల శివారు ఈతవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. వనంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి వేలాది ఈత చెట్లు కాలిబూడిదయ్యాయి. ఇలాంటి ప్రమాదం జరగడం ఇది నాలుగోసారి అని గీత కార్మికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ శిథిలావస్థకు చేరిందని, దానిని మార్చాలని, మరమ్మతులు చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఎండల తీవ్రతకు తోడు విద్యుత్ శాఖ నిర్లక్ష్యం తోడవడంతో గీతాకార్మికుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని గీతా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతరం గీతా కార్మికుల సంఘం అధ్యక్షులు జవ్వాజి నర్సాగౌడ్, మరి పెల్లి లక్ష్మణ్ గౌడ్ లు మాట్లాడుతూ విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన గీతాకర్మికులకు కుటుంబానికి రూ.1 లక్ష చొప్పున తక్షణ పరిహారం అందించాలని, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను 48 గంటల్లో తొలగించాలని, ఈతవనాల వద్ద వేసవి ఫైర్ సేఫ్టీ చర్యలు చేపట్టాలన్నారు.





## ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందడి




**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 19 చట్టం :** పెరిగింది పుస్తక పఠనం, ఎస్సే రైటింగ్ పోటీలతో పిల్లల్లో మేధో వెలుగులు ఆగిరిపల్లి: వేసవి సెలవులు అంటే కేవలం ఆటలు మాత్రమే కాదు, పుస్తకాలతో స్నేహం చేసి జీవిత పాఠాలు నేర్చుకునే అవకాశం కూడా అని ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయం నిరూపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 28-04-2026 నుండి 06-06-2026 వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలు ప్రతిరోజూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ శిబిరంలో పిల్లలు కథల పుస్తకాలు, నీతి కథలు, విజ్ఞాన పుస్తకాలు చదువుతూ పఠనాభిరుచిని పెంచుకుంటున్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకం చదవడం అలవాటు చేసుకుంటున్నారు. పఠనంతో పాటు ఎస్సే రైటింగ్ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు పిల్లల్లో సాధారణ జ్ఞానం, ఏకాగ్రత, ఆలోచనా శక్తిని పెంచుతున్నాయి. వేసవి సెలవుల్లో పుస్తకాలతో సమయం గడపాలని గ్రంథాలయ సిబ్బంది సూచిస్తున్నారు. పుస్తక పఠనం వల్లే నిజమైన జ్ఞానం, ఆత్మవిశ్వాసం వస్తాయని, ప్రతి విద్యార్థి రోజూ లైబ్రరీకి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని పిల్లల్లో పఠనాభిరుచి, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ శిబిరం ముఖ్య లక్ష్యమని గ్రంథాలయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

### 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి

హైదరాబాద్,మే18(ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీట్లర ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# కరీంనగర్‌లో TPNM వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 18 ,(చట్టం బ్యూరో) :** మే 25,26వ తేదీలలో హైదారాబాద్ లో జరిగే తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని నేడు కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో వాల్ పోస్టర్స్ ఆవిష్కరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కెంసారం కోమల,సహాయ కార్యదర్శులు జక్కి మంజుల,గుర్రం సదానందం,కోశాధికారి బోలుమల్ల రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుడ్డేల రవి,సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటలో ఉపాధ్యాయులు



**కొడిమ్యాల, మే 18(చట్టం) :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తిర్మలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో అన్నీ ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తైదల అంజయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కార్పొరేషన్ చైర్మన్ కు సన్మానం



**బోయిన్ పల్లి మండలం / మే 18 ,(చట్టం బ్యూరో ) :** తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ ను చొప్పదండి నియోజకవర్గం మున్నూరు కాపు సంఘం నాయకులు సోమవారం కరీంనగర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చక్రవర్తి పటేల్ ను శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం మున్నూరు కాపు కుల గనులకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఇక్కడ మున్నూరు కాపు సంఘం చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ , తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్, సంఘం నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, కోల రమేష్, అమిడిశెట్టి వెంకటేశం, పూదరి తిరుపతి, ఆకుల శంకరయ్య, అమిరిశెట్టి భూమిరెడ్డి, కటకం మనీష్, సర్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

### మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు

### ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

### అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం

**కోల్‌కతా,మే18 :** సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

# ప్యారా లీగల్ వాలంటీర్ల శిక్షణా కార్యక్రమం..

**కర్నూలు, చట్టం న్యూస్ (18 మే 2026) :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ వారి ఆదేశాల మేరకు సోమవారం నాడు కర్నూల్ జిల్లా న్యాయ సేవ సదన్ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ప్యారా లీగల్ వాలంటీర్లకు వారి విధులు, విధివిధానాలు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం 1987 ప్రకారం ప్యారా లీగల్ వాలెంటీర్స్ పనిచేస్తారని తెలిపారు. ప్యారా లీగల్ వాలంటీర్స్ ప్రవర్తన నియమావళిని పాటిస్తూ బాధితుల ప్రయోజనాలు కాపాడాలని తెలిపారు. ప్యారా లీగల్ వాలంటీర్లు సమాజంలోని సామాన్య ప్రజలకు మరియు న్యాయ సేవ సంస్థలకు మధ్య వారిదిగా వ్యవహరించాలని తెలిపారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ 2009 పథకం ప్రకారం బలహీన వర్గాలకు న్యాయసహాయ మందేలా చూడడంలో



కీలకపాత్ర పోషించాలని తెలిపారు.న్యాయ చైతన్యం కల్పించడం- ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ మరియు బలహీన వర్గాలకు వారికి ప్రాథమిక హక్కులను, చట్టపరమైన హక్కులను మరియు బాధ్యతలను గురించి తెలియజేయాలని తెలిపారు. న్యాయ సహాయం మరియు మార్గదర్శకత్వం - సాధారణ ప్రజలు మరియు తాలూకా మరియు జిల్లా న్యాయ సంస్థల మధ్య వారిదిగా పని చేయాలని తెలిపారు. న్యాయపరమైన సమస్యలు ఉన్నవారికి ప్రాథమిక సలహాలు ఇవ్వడం కౌన్సిలింగ్ చేయడము ఎవరైనా న్యాయ సహాయం కోసం అభ్యర్థిస్తే అధికార సంస్థ కార్యాలయానికి వారిని తీసుకెళ్లడం మరియు దరఖాస్తు చేసుకోవడంలో సహాయపడాలని తెలిపారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ శివరామచంద్రరావు మాట్లాడుతూ ప్యారా లీగల్ వాలంటీర్స్ పెండింగ్లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో పరిష్కరించుకోవడంలో ప్రజలకు అవగాహన కల్పించడం మరియు ప్రోత్సహించడము చిన్నచిన్న వివాదాలు అనగా భూమి వివాదాలు కుటుంబ వివాదాలు స్థానిక స్థాయిలో న్యాయస్థానానికి వెళ్లకుండానే సామరస్యకంగా పరిష్కరించడానికి ప్రయత్నించాలని తెలిపారు. సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారానికి ఆగస్టు 21,22,23 వ తేదీలలో జరగబోయే ప్రత్యేక లోక్ అదాలత్ గురించి ప్రజలకు వివరించి వారి కేసులను సామారస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు, న్యాయవిద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు మొదలగువారు ప్యార లీగల్ వాలంటీర్లు గా న్యాయ సేవ అధికార సంస్థలో పనిచేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# వేసవిలో ఇల్లు జర జాగ్రత్త

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 18 చట్టం ప్రతినిధి :** ఆగిరిపల్లి లో దొంగ తనాలు, ఇతర ఆస్తి నేరాలను అరి కట్టేం దుకు ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు వారి యొక్క సిబ్బంది తో కలిసి మైక్ ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టారు నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామ కృష్ణ గారి యొక్క ఆధ్వర్యం లో ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు వారి యొక్క సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధి లోని ప్రధాన కూడళ్లు మరియు వీధుల్లో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. వేసవి సెలవులలో ఇళ్లకు తాళం వేసి ఊరెళ్లే వారు తప్పని సరిగా స్థానిక పోలీసు లకు సమాచారం అందించాలని, వీలైతే పొరుగు వారిని గమనిస్తూ ఉండమని కోరాలని సూచించారు.

LHMS (లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం) సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎస్ఐ గారు తెలియ చేసినారు. ప్రతి ఇంటి యజమాని మరియు వ్యాపారస్తులు తమ ఆవరణలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు.

కొత్త వ్యక్తులు లేదా అనుమానా స్పదంగా తిరుగుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి వివరాలను అడిగి తెలుసుకోవాలని కోరారు.

రాత్రి సమయాల్లో కిటికీల దగ్గర పడుకునే టప్పుడు మరియు ప్రయాణాల్లో ఉన్న పుడు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏదైనా అనుమా నాస్పద ఘటన జరిగినా లేదా అపరి చిత వ్యక్తులు కనిపించినా వెంటనే డయల్ 112 కు గాని పోలీసులకు సమా చారం అందించాలని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ నెంబర్ ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ గారు మాట్లా డుతూ ప్రజల సహకారం ఉంటేనే నేరాలను సమర్ధ వంతంగా అరికట్ట గలమని తెలిపారు. పోలీసుల



నిరంతర గస్తీతో పాటు, ప్రజలు కూడా స్వీయ రక్షణ చర్యలు పాటించాలని కోరారు.ఈ మైక్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు కూడా రక్షణపై అవగాహన కలుగుతుందని ఆయన పేర్కొన్నారు

## ఐకెపి సెంటర్‌ని సందర్శించిన ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు**



**ఎండపల్లి, మే 18 చట్టం.:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామంలోని ఐకెపి సెంటర్ ని సందర్శించిన ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకి ఎటువంటి ఇబ్బంది లేకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియ ఐకెపి సెంటర్లలో సజావుగా కొనసాగుతుందని ప్రతిపక్షాలు అనవసరంగా లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని రైతులకి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా త్వరగా వడ్లు కొనుగోలు చేయడమే కాకుండా రైతుల అకౌంట్ లలో వెంటనే డబ్బులు జమ చేయడం జరుగుతుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి శైలందర్ రెడ్డి , ఎండపల్లి మండల మండల పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేశం , ఫాక్స్ చైర్మన్ రాంరెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి గారు, చర్లపల్లి గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి ,ఉపసర్పంచ్ తిరుపతి , గ్రామశాఖ అధ్యక్షులు మహేష్ , ఆలయ కమిటి డైరెక్టర్ మెరుగు శ్రీను ,పత్తిపాక శ్రీధర్ , హో?లోజ్ శ్రీనివాస్, మాచర్ల సంజీవ్ మాదాసు శ్రీను, సెంటర్ ఇంచార్జ్ ఆగండ్ల రవి , సోమిశెట్టి రమేష్ , గాజుల విజయ్ , గెల్లు శ్రీనివాస్ , , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కలిసిన యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు అమిరీ శెట్టి భూమి రెడ్డి



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా /మే 18 ,(చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు అమిరి శెట్టి భూమిరెడ్డి తెలంగాణ రాష్ట్ర నూతన మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కరీంనగర్ నగరంలో నిర్వహించిన సన్మాన సభలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి శుభాకాంక్షలు తెలిపినట్లు రానున్న రోజుల్లో మున్నూరు కాపుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్నూరు కాపు సంఘం యువనాయకులు పలువురు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన పద్మశాలి కుల సభ్యులు.



**పెగడపల్లి, మే 18 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని బతికేపల్లి గ్రామానికి చెందిన పద్మశాలి సేవా సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి ఓల్లాల వెంకటేశం,గత అయిదు రోజుల క్రితం అనారోగ్యం తో మరణించగా అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పద్మశాలి కుల సభ్యులు సేకరించిన 28,200 రూపాయలు వారి కుటుంబానికి ఇవ్వడం జరిగింది.భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది.మృతుడికి భార్య,పన్నెండేళ్ళ కుమారుడు ఉన్నాడు.ఇక్కడ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు ఎలగొండ వెంకట రమణ,ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్తన్న,కుల పెద్దలు బింగీ తిరుపతి,స్వర్గం లక్ష్మణ్,ఓల్లాల శ్రీనివాస్, ఒల్లాల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ యూనివర్సిటీ విద్యార్థుల అద్భుత ప్రతిభ



ఏలూరు జిల్లా ఆగిరిపల్లి సమీపంలోని డాక్టర్ ఆర్వీఆర్ ఎన్ఆర్ఐ డీమ్డ్ యూనివర్సిటీ ద్వితీయ సంవత్సరం డాటా సైన్స్ విద్యార్థునులు నగుళ్ళ తన్మయి, పి.మౌనిక Geeks for Geeks online education platform నందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్యాంపస్ అంబాసిడర్ లు గా ఎంపిక అవ్వడమే కాకుండా, భారతదేశ స్థాయిలో 18 మరియు 43 ర్యాంకులు సాధించినారు. వీరి ప్రతిభను గుర్తించిన Geeks for Geeks సంస్థ కీబోర్డ్, మౌస్, పెన్, బ్యాగ్, టీషర్ట్ తో పాటు 2500 రూపాయల నగదు బహుమతి ఇచ్చినారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సదరు విద్యార్థులను యూనివర్సిటీ ఛాన్సర్ డాక్టర్ రావి వెంకట్రావు గారు, వైస్ ఛాన్సర్ డాక్టర్ కె ఆర్ ఎస్ సాంబశివరావు గారు, ప్రోవైస్ ఛాన్సర్లు డాక్టర్ జి. సాంబశివరావు గారు, డాక్టర్ సిహెచ్ నాగ భాస్కర్ గారు , రిజిస్టర్ డాక్టర్ బి. రాఘవరావు గారు, ఈవో శ్రీ తేజ సాయి గారు మరియు డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ గారు మరియు అధ్యాపక బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.....

## ట్రక్కును ఢీకొన్న కంటెయినర్..పదిమంది మృతి

ముంబై,మే18 :మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

# రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...

- **చీకటాయిపాలెం ఐకెపి సెంటర్లో బస్తాల కొరత లేదు..**
- **రాజకీయాల కోసం రైతులను ఆందోళనకు గురి చేయొద్దు...**
- **టిఆర్ఎస్ నాయకులారా ఇకనైనా అసత్యపు ప్రచారాలు మానుకోండి.**
- **గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి, పొడకంటి సరస్వతి శేఖర్.**



**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్,మే18 (చట్టం న్యూస్) :** రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చీకటాయపాలెం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి,పొడకంటి సరస్వతి శేఖర్ లు అన్నారు. చీకటాయిపాలెం గ్రామంలో గత రెండు రోజులుగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐకెపి సెంటర్ నిర్వహణపై చేస్తున్న అసత్యపు ఆరోపణలపై గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ స్పందిస్తూ... సోమవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేయడం జరిగింది. అనంతరం వారు సంయుక్తంగా మాట్లాడుతూ
గ్రామంలోని కొనుగోలు సెంటర్లో గన్ని బస్తాల కొరత లేదని టిఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలనే రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి లా ఆదేశానుసారం తొర్రూర్ మండలంలో మన గ్రామానికి అధికంగా లారీలు రావడం మూలంగా పదివేల బస్తాలు కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించడం జరిగింది. మిల్లులోకి తరలించిన అన్ని బస్తాలలో ఏ ఒక్క రైతుకు కూడా కట్టింగ్ లేకుండా అన్లోడ్ జరిగిందని అన్నారు.రెండు రోజుల క్రితమే మరల పదివేల గన్ని బస్తాలు అందుబాటులోకి తేవడం జరిగింది. వీటిని కూడా సీరియల్ ప్రకారమే కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ ఇన్చార్జికి సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా సీరియల్ ప్రకారమే కొంతమంది రైతులకు సర్పంచ్ తానే దగ్గరుండి ఏ గొడవలు లేకుండా గన్ని సంచులు ఇప్పియడం జరిగింది. కావాలనే టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని,ప్రతి విషయాన్ని పార్టీ పరంగా చూడకుండా గ్రామ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని అన్నారు.

అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బూరుగుల దస్తగిరి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో సెంటర్లలోకి ఒక్క లారీ కూడా రాలేని సందర్భంలో రైతుల సొంతంగా ట్రాక్టర్లు మాట్లాడుకుని మిల్లులోకి వెళ్తే, మిల్లర్లు ఒక ట్రాక్టర్ కి పది నుంచి 20 బస్తాలు కటింగ్ అవుతున్నాయని రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఆరోజు కనీసం రైతుల పక్షంలో ఒక్క టిఆర్ఎస్ నాయకులు కూడా మాట్లాడలేదు కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి సెంటర్ కి ప్రభుత్వమే లారీలను పంపిస్తున్న, లారీలు రావట్లేదని అబద్ధపు మాటలు మాట్లాడడం, గన్ని బస్తాలు ఉన్న లేవని చెప్పడం రైతులు ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిన్నాల వేణు, వార్డు సభ్యులు వేల్పుగొండ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె దయాకర్, వేల్పుగొండ చిన్న వెంకన్న,తండు యాకయ్య,సింగం దామోదర్, వేల్పుగొండ ఉప్పలయ్య, కొండ లింగయ్య, రైతులు కొండ కొమురయ్య,కొండ శ్రీశైలం, బూర్గుల దేవదానం, జీడిగంటి సోమయ్య, వేల్పుగొండ వెంకట్నర్సు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్.గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- **పేదల గోస కేంద్ర ప్రభుత్వానికి పట్టదా.**
- **అధిక ధరలతో నిరుపేదల జీవితాలతో చెలగాటమాడుతున్న బీ.జే.పీ**
- **డిసిసి అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి.**


**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/ కేసముద్రం /18 /మే :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం లోని మహమూద్ పట్నం గ్రామంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మహమూద్ పట్నం సర్పంచ్ కట్ల ఎల్లయ్య, సప్పిడి గుట్ట సర్పంచ్ బానోత్ బద్రు, భూక్యారం తండా సర్పంచ్ జాటోత్ సోమీ, వీరితోపాటు డిసిసి అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ముందు నల్లధనాన్ని తీసుకువచ్చి పేద ప్రజలకు పంచుతానని చెప్పి అధికారంలోకి వచ్చిన మూడు పర్యాయాల తర్వాత కూడా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు మోడీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచకుండా ఎన్నికల తర్వాత పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలకు ఆర్థిక భారాన్ని పెంచి మరొక్కసారి దేశ ప్రజలను మోసం చేసిన బిజెపి పార్టీ , పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. పెంచిన ధర భారంతో చిన్న చిన్న హోటల్లు నడిపించే మధ్యతరగతి వారిపై భారం పడి వాటిని మూసి వేస్తున్నారు. ధరలు పెరగడం వలన నిత్యావసర ధరలు , రవాణా వ్యవస్థ పై, తీవ్ర ప్రభావం పెరిగి దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులపై ప్రభావాన్ని చూపిస్తున్నది. మోడీ హటావో దేశ్ కి బచావో అనే నిదానంతోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ



విషయాలను ప్రజలకు తెలియపరచాలని కోరుచున్నాను. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమృత శ్రీనివాస్, తౌరియా తండా ఉపసర్పంచ్, ధరావత్ మహేందర్, పార్టీ అధ్యక్షులు మిట్టగడుపుల. యాకూబ్, జాటోత.రమేష్, మాజీ ఎంపిటిసి ముంజల శ్రీనివాస్, వెంకటాచారి, మందుల ముత్తయ్య, భాష మార్చు, కట్ల లచ్చమ్మ, బానోతు వీరు, తొగరి తిరుపతి, ఇస్లావత్ సంతోష్,సురేష్, కాంభోజి యాకయ్య, జాటోత్. రాము పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేసినందుకు హర్షం వ్యక్తం చేసిన ఉద్యమకారులు:

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం/ 18/మే :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కె.కేశవరావ్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసినందుకు కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. కేసముద్రం పట్టణంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులను త్వరితగతిన గుర్తించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. కమిటీ వెంటనే విధివిధానాలు ప్రకటించి, కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలైన



తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం, డబుల్ బెడ్ రూం, ఉద్యమకారుల గుర్తింపు, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు 10 లక్షల ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పిసిసి సభ్యులు గుగులోత్ దస్రూనాయక్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చాలని, కమిటీ కాలయాపన చేయకుండా వెంటనే హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, జెఎసి పూర్వ కన్వీనర్ మోడెం రవీందర్ గౌడ్, విద్యార్థి, యువజన జెఎసి పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, కర్పూరపు మురళి, తోట సుధాకర్, జల్లె జయరాజ్, బాలు మోహన్, సోమారపు వెంకటయ్య, చుంచు సూరయ్య, కీర్తి సమ్మయ్య, మాందాటి ఆంజనేయులు, నానబాల దూడయ్య, నాగరబోయిన చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## మోడీజీ సామాన్యుల ఘోష పట్టదా?



**మహబూబ్ నగర్ 18 మే 2026 ట చట్టం న్యూస్) :** వనపర్తి జిల్లా గోపాల్పేట్ మండలం బస్టాండ్ లో సామాన్యులపై ధరలు పెంచడం వల్ల పెట్రోల్ డీజిల్ ధరలు లీటరుకు మూడు రూపాలు చొప్పున పెంచినందుకు నిరసనగా గ్యాస్ సిలిండర్ ధర 993 పెంచడానికి వ్యతిరేకంగా ఆటోకు తాళ్ల కట్టి కొంత దూరం లాగి భవిష్యత్తులో ఆటోలను మనుషులే లాక్కొని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని సూచనగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ బంగారం కొనుద్దని డీజిల్ పెట్రోల్ వాడకంలో సామాన్యుల నెత్తిపై అదనపు భారాన్ని మోపడమే కాకుండా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఫలితాలు వచ్చిన వెంటనే లబ్ధి చేకూరిన తర్వాత పెంచాలని హామీ ఇచ్చారు.
దేశ ప్రధాని మోదీ సామాన్యుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని పేదలను ఆర్థిక భారంతో సతమవుతవస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించి పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని ధరలు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి ముట్టడిస్తామని ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు వాళ్ళ జీవన శైలు ఎలాంటి భంగం వాటిల్లకుండా కూడా సామాన్య ప్రజలకు సుపరిపాలన అందించాలని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ చంద్రయ్య గోపాల్పేట్ మండల కార్యదర్శి శాంతన్న పోలికపాడు గ్రామ కార్యదర్శి బుచ్చన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రం మూడులో పౌష్టికాహారం పంపిణీ.



**పెగడపల్లి, మే 18( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని ఐతిపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రం మూడు లో సీడీపీఓ వీరలక్ష్మి, సూపర్వైజర్ సుభద్ర,అంగన్వాడి టీచర్ మీర్యాని ఆధ్వర్యంలో పిల్లలకు పౌష్టికహర దృష్ట కోడిగుడ్లు,పంపిణి చేయడం జరిగింది. గ్రామ సమాజం ఆరోగ్యం పై ఉన్న చైతన్యం స్పష్టమవుతుంది పిల్లల శారీరక మానసిక అభివృద్ధి కి ఇది ఎంతో ఉపయోగకరం తల్లి తల్లితండ్రులు పాల్గొనడం వాళ్ళ పౌష్టికహర ప్రాముఖ్యత పై అవగాహనా పెరుగుతుంది. అన్నారు ఈ కార్యక్రమంలో ,సీడీపీఓ వీరలక్ష్మి, సూపర్వైజర్ సుభద్ర,అంగన్వాడి టీచర్ మిర్యాని, ఆయా విజయ లక్ష్మి,పిల్లలు వారి తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

## భూదాన్ పోచంపల్లిలో 2కె రన్

**అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి**




**భూదాన్ పోచంపల్లి ; మే 18 (చట్టం ప్రతినిధి) :** గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్చార్జి ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి అన్నారు . పట్టణ కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 కార్యక్రమంలో భాగంగా 2కె రన్ నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అధికారులు సమన్వయంతో అభివృద్ధి జరిగేలా చూడాలని సూచించారు . కార్యక్రమంలో ఎస్సై లైలా , ఆయా గ్రామాల సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు .

## కోళ్ల పందెంలో జరిమానా



**కర్నూల్ , చట్టం న్యూస్ (18 మే 2026 ):** చట్టానికి విరుద్ధంగా కోళ్ల పందెం ఆడుతున్న 19 మందిని అరెస్టు చేసి సెకండ్ క్లాస్ రూరల్ మెజిస్ట్రేట్ బిటి అనురాధ ముందర హాజరుపరచగా ఏపీ గేమింగ్ చట్టం ప్రకారం ఒక్కొక్కరికి 800 రూపాయలు జరిమానా విధించారు.

## తాలు తప్ప పేరుతో కటింగ్ లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్. బిఆర్ఎస్ నాయకులు.





**పెగడపల్లి మే 18 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి రహీం, ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైతులు పడే ఇబ్బందులను గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి రహీం, మాట్లాడుతూ వరి ధాన్యము బస్తాకు రెండు కిలోల కోత లేకుండా కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వము ఎలాంటి కోత లేకుండా వరి ధాన్యం కొంటామని చెప్పి ఇప్పుడు బస్తాకు రెండు కిలోల కోత పెట్టడం రైతులను మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎండి రహీం, గోలి సంజీవరెడ్డి, పలమూరు విజయ్ యాదవ్, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, ఎండి రజాక్, చీమల తిరుపతి, జిట్టావేణి కొండయ్య, గోపాల్ రెడ్డి, ఎండి జానీ పాషా, జిటవెని శ్రీనివాస్, బొమ్మ గోని శ్రీనివాస్,నల్లాల చందు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గంచాలి. సీపీఎం.



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/ కేసముద్రం 18/మే :** పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని కేసముద్రం, అంబేద్కర్ సెంటర్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆటోను తాళ్లు కట్టి లాగుతు ఆందోళన, నిరసన కార్యక్రమం చేసిన ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు, ప్రతి నెల పెంచడం వల్ల, జీవనోపాధి కోసం ఆటోలు నడుపుతున్న కార్మికులకుటుంబాలు రోడ్డున పడతాయన్నారు.
అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు, పెట్రోల్ డీజిల్ గ్యాస్ వినియోగదారులకు ధరలు తగ్గించ లేదు. క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయని పొదుపు సూత్రాలు చెబుతూన్నారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరగడం వల్ల నిత్యవసర సరుకులుధరలుపెరుగుతాయని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆయిల్ కంపెనీల లాభం కోసం ప్రజా వ్యతిరేకవిధానాలు మానుకొని ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు బొబ్బల యాకుబ్ రెడ్డి,చాగంటి కిషన్, నీరుటి జలంధర్, జల్లే జయరాజ్, సోమరపు ఎల్లయ్య, ఎండి యాకుబ్ పాషా, ఆటో కార్మికులు బెజ్జం నాగరాజు, ఎండి రబ్బాని, యాకన్న, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**బోయిన్ పల్లి మండలం / మే 18 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలం లోని జగ్గారావు పల్లి గ్రామం లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,మండల అధ్యక్షులు కొమ్మన బోయిన సువీన్ యాదవ్,సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్,సర్పంచ్ సుద్దాల మధు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**చట్టం సాహితీ లోకం** 95814 19999



## ప్రపంచాన్ని గెలువు..!

జీవిత పయనంలో
ఆత్మీయ గమనంలో
లక్ష్య సాధనలో
మాట పొదుపు
డబ్బు పొదుపు
కాలం పొదుపు
ఎక్కించును నిన్ను అందలం
చూపించును మంచి మార్గం
విజయం చేరాలన్నా
ఓపిక సహనంతో పాటు
వినయం కావాలి
అవగాహన పెరగాలి
ఆశ కావాలి
అత్యాశ నశించాలి
కోపం క్రోధం పోవాలి
సన్మార్గంలో పయనించాలి
ఆచరణలో సత్యం ఉండాలి
జీవులపై ప్రేమ నిండాలి.
ఆదరణ ఆప్యాయత చూపాలి.
మేలు కోరితే
మేలు జరుగును
కక్ష పడితే
పగలే మిగులును
శాంతంతో ఉండు
ప్రశాంతంగా సాగు.
ప్రపంచాన్ని గెలువు.

డా.యణమనగండ్ల రాజేందర్
వికాస వేదిక కార్యదర్శి
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం.



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## నిశీధి అల.



నా మది ఆవిరైపోయే
ఆశలు పెంచుకొని పేక
మేడలైపోయిన నీ...
ప్రేమ కోసం అనుక్షణం
మదనపడుతూ... నా
కన్నీటి ధారలు పెక్కుటిల్లాయి.
నా హృదయ నాళాలలో
దాగి ఉన్న వెధ.... ఆ నిశ్శబ్ద
నిశీధిలో నిద్రపోని కన్నులు
దూరమైన నీ రూపాన్ని
నా శ్వాస ఆపి చూస్తున్నాయి.
నా హృదయం ఆ కాలం అనే
కౌగిలిలో బందిఖానై...
ఎడారిలో వాడిపోయిన
పువ్వుగా మిగిలిపోయింది.
ప్రియ నేస్తమా... నాపై నీ
ప్రేమ వర్షం కురిపిస్తావని
నా ఆశల హృదయ
సంద్రంలో అలలై.. ఎగిసి
పడుతున్నాయి.
ప్రియా... నా జీవితానికి
పూర్వ వైభవాన్ని
అందిస్తావని ఆశతో....!

శ్రీ భార్గవ్ సైదులు, పెంచికల్ దిన్నె,
సూర్యాపేట, 9989023822.

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## జీవన్మరణం స్థితికి మేల్కొపు



పూవులలోని మకరందం తుమ్మెదకు కమ్మని విందు అసలు పూవులే లేకుంటే,,,,,,,, ఆకలితో అలమటించే బాటసారికి పట్టెడు పరమాన్నం పెట్టిన గృహిణి మనస్సు పసిడి పూలతేరు,,,,,,,,,
ఎంతో శ్రమల జీవితం అనుభవిస్తూ కష్టాలు కన్నీళ్ల తలరాతలో మగ్గిపోయిన దినసరి కూలీకి మేమున్నామంటూ ప్రభుత్వం వారు ఒకింత నెలసరి పెన్షన్ ఇస్తే బ్రహ్మానందం,,,,,,,,,,
తినడానికి తిండిలేక కూలీ నాలీ అతుకుల బ్రతుకు ఉన్నత విద్య అభ్యసించి కుటుంబ భారంతో మగ్గిపోయే నిరుద్యోగికి జీవితంలో వెన్నెల గూడులా ఎప్పుడో ఇంటర్వ్యూ కెళ్ళిన ఉద్యోగం తొక్కిపట్టిన వ్యవస్థ నుండి ఉద్యోగం ఇప్పించిన వకీలు తన విధినిర్వహన మరువక రహదారి వేసిన మరువగారాని జీవితంలో అమృతం కురిపించిన దైవం,,,,,,,,,,
పొద్దస్తమానం బిచ్చమెత్తుకున్న బిక్షగాడికి వచ్చిన ఐదు రూపాయలతో కాలే కడుపుకు రెండు మిరపకాయ బజ్జీలు కొనుక్కు తింటున్న దీనత్వం సమస్తం గమనించిన దయగల ప్రజా సేవకుడు అతడిని అనాధాశ్రయంలో చేర్పించిన దృశ్యం అమూల్యమైన దైవసేవ,,,,,,,,,,
బట్టలు మట్టికొట్టుకుపోయి రోడ్లమీద వెర్రిచూపులు చూస్తూ తిరిగేవాడిని పిచ్చివాడిగా ముద్రవేసి వేధించే జనం లోంచి దయగల మహానుభావుడు అతడిని మానసిక వైద్యశాలలో చేర్పిస్తే అతడి హృదయం తేనెపట్టు,,,,,,,,,,,,
నేనంటే నేనే గొప్ప అని వదురుబోతు రాజకీయ నాయకులు టీవీల నిండా వాదప్రతివాదాలు చేసే వీళ్ళు ఈ ప్రజాసేవకుల ముందు ఏపాటి,,,,,,,!!??!!

అపరాజిత్
సూర్యాపేట

## నేను లేకున్నా నా అక్షరాలు మిగులుతాయి,,,,,!!

చెదపురుగులు తిని విరిగి కూలిపడిన వృక్షంలా
మనస్సు గూడు వేదనలు చుట్టుముట్టి కొరికి విరిగి నలిగి జీవం కోల్పోయి ముక్కలైన మనస్సు పొరలలో జ్ఞాపకాల అలజడులు,,,,,,,,, మనస్సు పాడే విషాద గీతం చెదిరి విరిగిన సాఫీగా సాగని చేదు జ్ఞాపకాల ఆలాపన,,,,,,, నా వెనుక ముందు గోతులు తీసి తోసేసేందుకు సమయం కోసం వేచిచూసే విధి వక్రించిన తలరాత,,,,,,,
నా రంగు రంగుల కలలు కళలు హృదయం పూసిన అక్షరాల చిత్రాలు కాగితం పూవులై తేలిపోతున్నాయి ,ఒకవేళ నీ కళ్ళు పలికే మూగ ఆరాధనలో నా అక్షరాలు నీ హృదయాన్ని తాకినట్లే నసుకుంటా ,,,,,,,,,,,
బ్రతుకు భారమై హృదయం పావురమై లోకం విడిచి వెళ్ళిపోయేప్పుడు నా కలం పలికిన అక్షరాలను వీడి అగ్నికి ఆహుతి అవుతున్నా నా అక్షరాలే నా కళ్ళల్లో మెదులుతాయి ఏ భవబంధాలు గుర్తుకు రావు,,,,,,,,

అపరాజిత్ సూర్యాపేట

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## డి ఎడిక్షన్



ముక్క బీడీని గుక్క పెట్టుకుని పీల్చిన సిగరెట్టు హుక్కా పొగను మత్తుగా నషాళానికి లాగించిన
ముంత కళ్ళు మూతి నాకినా
చుక్క సారాకు , చీప్ లిక్కరుకు
గంజాయి కి బానిసలు అయినా
పాన్ , గుట్కా , పొగాకులకు , నషాలకు ఎడిక్ట్ అయినా
పోగాలము దాపరించి నట్లే
డ్రగ్స్ కు సంబంధించిన ఏ అలవాటైనా ఖేల్ ఖతం ఆరోగ్యం మరియు బతుకు బండి సర్వ నాశనం
ఎడిక్షన్ కు అందరూ సమానమే డి సెంట్ జీవితాలు కూడా దెబ్బ తింటాయి
మనసు మాట వినదు కదా అలవాటు మానదు కదా అని
హద్దు దాటి ఆపుకో లేక ఎడిక్ట్ అయినా జీవితం అధోగతి ...

డి చాంద్ బాషా రచయిత

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## పొదుపు



పొదుపు అంటే కూడా బెట్టడం
ప్రతి మనిషి వద్ద గల ధనాన్ని
దుబారా ఖర్చు చేయకుండా
మితంగా ఖర్చు చేస్తూ
వీలైనంత వరకు కూడా బెట్టాలి
ఇప్పుడు పొదుపు చేసుకున్నది
అవసరానికి పనికి వస్తుంది
అనవసర ఖర్చులు మంచివి కావు
మనిషి విచ్చలవిడిగా
ఖర్చు చేయడం ఒక వ్యసనమే!
చిన్నతనం నుండి పొదుపును
అలవాటు చేసుకోవాలి
డబ్బును కూడా బెట్టడం
మిత వ్యయం చేయడం
వస్తువులను పొదుపుగా వాడడం
పొదుపు అనేది మాత్రం
మానవ జీవితంలో
ఒక భాగం కావాలని గుర్తించుకో!
ఈరోజు తీసుకునే జాగ్రత్త
భవిష్యత్తులో సుఖాన్ని
మనిషికి అందిస్తుంది
పొదుపు అనేది భవిష్యత్తు
పాలిట కల్పవృక్షం కావాలి.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు. చరవాణి : 9866179385

**చట్టం సాహితీ లోకం** 95814 19999

## కుల,మతమౌడియం పోవాలి



మత మౌడియం పోవాలి
మనిషినిమనిషి ద్వేషించే

కులతత్వం అంటరానితనాన్ని
వెంటనే రూపుమాపాలి

మనిషిని మనిషి గౌరవించే
సమ సమాజం రావాలి

అందరికీఒకే న్యాయం కావాలి
చట్టంఅందరికీఒకేలా ఉండాలి

దోపిడీ విధానం నశించాలి
బానిసత్వాన్ని రూపుమాపాలి

ప్రేమ తత్వాన్ని సమాజానికి
అర్థమయ్యేలా బోధించాలి

స్త్రీలను గౌరవించాలి
స్త్రీలకు ప్రాధాన్యత నివ్వాలి

చట్టాలను గౌరవించాలి
చట్టం అందరికీ అందాలి
??
కులంలేని సమాజం కావాలి

మంచి నాయకులు ఉండాలి

మానవత మనిషిలో ఉండాలి
దేశాన్ని మనం ప్రేమించాలి

నిజాయితీ నాయకులు
రాజకీయాలలో ఉండాలి

అప్పుడే ఈ సమాజ లో
తప్పక మార్పు వస్తుంది

సమాజమే దేవాలయం
చట్టం మన ఆరాధ దైవం

మంచి వారికిఓట్లు వేయండి
మంచి రాజ్యాన్ని స్థాపించండి

రచన సౌపాటి ప్రభాకర్
బ్రాహ్మణ కోదూరు గ్రామం
సాహితీ రత్న తెలుగుతేజ
నంది అవార్డుల గ్రహీత


**చట్టం సాహితీ లోకం** 95814 19999

## విరహ తాపం



విరహం వరం కాదు శాపం
జీవితం వేదనా భరితం
క్షణమొక యుగమై గడుస్తుంది కాలం
దాని తాలూకు బాధ వర్ణనాతీతం
ప్రతిక్షణం గుర్తొస్తుంది నీ రూపం
మనసు పాడుతుంది కన్నీటి గీతం
ఆలోచనలు సాగుతున్నాయి అప్రతిహతం
అంతూ పొంతూ లేని నిర్వేదం
ఎప్పటికీ ఇది సమస్యాపూరణం
కంటి రెప్పలు మోయలేని భారం
తిరగలేక తనువు అవుతుంది భారం
ఆవరిస్తుంది నిశ్శబ్ద వాతావరణం
జంట బాసిన కోయిలలా నిట్టూర్పుల జీవితం
నీ తలపులతోనే గడుస్తుంది ప్రతిక్షణం
నీవు లేని జీవితం శూన్యం
ఆగిపోతుంది నా ప్రగతి రథచక్రం
ఆవిరైపోతుంది నాలోని ధైర్యం
పాడుకుంటుంది నా మనసు విరహ గీతం

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## మనిషి మనసు జీవితానికినికి మార్గదర్శి

మనిషి మనసు
ఆలోచనల పుట్ట
ఒక ఆలోచన తర్వాత
మరొక ఆలోచన
పుట్టుకొస్తుంది

ఆలోచనలు పరస్పరం
పోటీ పడుతాయి
ఆలోచనలు
ప్రత్యామ్నాయాలు

మనసు ప్రపంచం
ఒక అంతు చిక్కని
అద్భుతం
క్షణాల్లో ఆకాశ మంత
ఎత్తుకు ఎగురుతుంది
అగాధమంత లోతుకు
జారిపోతుంది

కంటికి కనిపించదు
ఆలోచనల అలలతో
నిరంతరం సాగే యుద్ధం
రెక్కలు లేకపోయిన
విశ్వమంతా ఎగురుతుంది
సంకెళ్లు వేసిన ఊహల
లోకంలో విహరిస్తోంది

ఒక్కో సారి ప్రశాంతమైన
సరోవరం
మరోసారి ఉప్పెన లాగ
విరుచుకు పడుతుంది
నిజాలను దాచి అబద్ధాల
ముసుగు వేస్తుంది

మనిషిలో కోపాన్ని పెంచేది
మనసే మనిషిలో ప్రేమను
పగనుప్రతీకారాన్ని కక్ష
కాఠిన్యత కలహాల
కల్లోలాలను సృష్టించేది
మనసే

మమకారపు బంధాలను
పెన వేసేది మనసే
బంధాలను
అనుబంధాలను
తెంపేది మనసే

యుద్ధాలను సృష్టించేది
యుద్ధాలనుఆపేతంత్రం
మనసే
విధ్వంసాన్ని సృష్టించేది
అభివృద్ధికిదిక్సూచి
మనసే

అహంకారపు గోడలు
నిర్మించేది మనసే
కుల మతాల మధ్య
సమరసతకు వారధి
మనసే

మనసును గెలిస్తే
లోకాన్నే గెలుస్తాం
మనోనిగ్రహం
మానవ మనుగడకు
గొప్ప ఆయుధం

నిర్మలమైన మనసు
నీతి నిజాయితీలకు
నెలవు
ప్రశాంతమైన మనసు
మానవాభివృద్ధికి మదుపు
మనోల్లాసం మానవ
తేజస్సుకు మణిహారం


మనసున్న మనసులుగా
ఎదుగుదాం
మానవతా పరిమళాలను
లోకమంతా చాటుదాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
9440245771



**చట్టం సాహితీ లోకం** 95814 19999

## మిణుగురు పురుగు



మినుకు మినుకుమంటూ నేల మీద వెలిగే నక్షత్రానివి,
చిట్టి పొట్టలో దాచుకున్న చిరు దీపానివి.
చీకటి మూలన ముడుచుకున్న ఒంటరి గుండెకు
ఆశ అయ్యేంత వెలుగు నీ రెక్కల్లో ఉంది.
“నేను చిన్నదాన్నే కావచ్చు,
చంద్రుడు రాని సందులో నేనుంటాను”
అంటావు.

“లోకమంతా వెలిగించే వెలుగైతే అది సూర్యుడిది,
కారుచీకటి గుండెలో నవ్వే వెలుగునవ్వును నేను.
పెద్ద వెలుగులు చొరలేని చోట,
చిరు దీపమే ఆశాదీపం కాగలదు” అని చెప్తావు.
చంద్రుడు మరుగైన రేయికి మిణుగురే మహారాజు.

అమావాస్య కటిక చీకటి రాత్రిలో
కాలి బాటకు దీపమై దారి చూపేది నీవే.
జిగేలుమంటూ మెరిసే నీ కాంతి సోకితే
చిన్నారి అరచేతులు పూబంతులవుతాయి.
ఆ కాంతి పువ్వును తాకాలని,
పసిపాపల కేరింతలు ఆకాశాన్నంటుతాయి.

నీవు చంద్రుడవు కాలేకపోవచ్చు.
కానీ నీ ఎదురుగా ఉన్న చీకటిని తరిమే
మిణుగురువు కాగలవు. అది చాలు.
నీ చిన్ని మంచితనమే ఒకరికి విశాల ఆకాశం.

తళుకు తళుకుమంటూ తేలియాడే భూ నక్షత్రాల్లారా,
చీకటి వాకిట్లో కాంతి తోరణాలు కట్టేది మీరే.
మనసు లోతుల్లో మధురానుభూతిని నింపేది మీరే.
చేతి దివిటీలా చీకటి గుండెను చీల్చి,
వెలుతురుతో ధైర్యాన్ని పంచేది మీరే.
మిణుగురుల పూలతో అలంకరించుకున్న రాత్రి
పెళ్లి పందిరిలా ముస్తాబై ఆనందాన్నిస్తుంది,
ఆహ్లాదం పంచుతుంది. ఏదో తెలియని వింత,
ఆ మిణుగురు సింగారం చిత్రమైన మాయ చేస్తుంది.

మినుకు మినుకుమంటూ తిరిగే ఓ మిణుగురూ,
పెద్ద వెలుగుల రథాలు రాలేని పల్లె సందుల్లో,
గొప్ప దీపాలు చేరలేని గుండె గదుల్లో,
నీ చిన్ని దీపమే దారి చూపే దిక్కవుతుంది.
నీ చిన్ని బతుకే వెలుగుకు అర్థం చెప్తుంది.

రచన: ఆనగల్లు మునిరత్నం
పూతలపట్టు, చిత్తూరు జిల్లా
చరవాణి: 9963288544



# కాఫీకప్పులో తుఫాన్

## కురుప్పులో విజయ్ అంటూ..ప్రచారం







సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్స్. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.




# పెద్దికి సెన్సార్ క్లీయరెన్స్

3గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం. దీంతో పాటు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్, సెన్సార్ టాక్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ చిత్రాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్నారు. అయితే 'పెద్ది' విషయంలో దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతో భారీ నిడివిని ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) రన్‌టైమ్‌తో సెన్సార్ పూర్తి చేసుకుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. సినిమాలోని భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్, కథలోని తీవ్రత ప్రేక్షకులను




మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే జీవన విధానం, క్రీడా సంస్కృతి, మనుషుల మధ్య ఉన్న భావోద్వేగాలు, పంతాలు, పట్టింపులను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు స్పష్టం చేశాయి. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని కూడా సమాచారం.

-------------

# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్లను ఖండించిన తల్లి స్వర్ణలత




నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.



# అట్లీ-ప్రియ దంపతులకు కూతురు

### మియూగా నామకరణం చేసినట్లు వెల్లడి

తమిళ దర్శకుడు అట్లీ కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. స్టార్ దర్శకుడు అట్లీ, ఆయన భార్య ప్రియ దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఇప్పుడు తమ చిన్నారి కుమార్తెకు పెట్టిన ప్రత్యేకమైన పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. గత ఏప్రిల్‌లో జన్మించిన తమ కుమార్తెకు అట్లీ దంపతులు 'మియూ' అనే ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు. పాప పుట్టిన దాదాపు నెల రోజుల తర్వాత, ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఈ పేరును అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి చేతిని ప్రేమగా పట్టుకున్న ఓ మధురమైన ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. ఆ పోస్ట్‌లో వారు, మా హృదయాలకు ఒక కొత్త ఇల్లు దొరికింది. ఆమె పేరు మియూ. మా గుండెల్లో అత్యంత పెద్ద స్థానాన్ని సంపాదించుకున్న చిన్నారి దేవత అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. ఈ పేరును ప్రత్యేకంగా నిలబెట్టింది దాని అర్థమే. సాధారణంగా భారతీయ లేదా సంస్కృత మూలాల పేర్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే అట్లీ దంపతులు జపనీస్ సంస్కృతి నుంచి ఈ పేరును ఎంపిక చేసుకున్నారు. జపనీస్ భాషలో 'మియూ' అంటే అందం, ప్రేమ, పవిత్రమైన సౌమ్యత కలిగిన వ్యక్తి అనే అర్థం వస్తుంది. ఈ విభిన్నమైన పేరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో అట్లీ దంపతులకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా, అట్లీ-ప్రియ దంపతులకు ఇప్పటికే ఒక కుమారుడు కూడా ఉన్నాడు. వారి పెద్ద కుమారుడు 'మీర్' జనవరి 2023లో జన్మించాడు.జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన క్రేజ్ పాన్-ఇండియా స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై అట్లీ దృష్టి సారించారు.



# కొరటాల, బాలయ్య కాంబో

### ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్

టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో

కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది. దేవర తర్వాత కొరటాల తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో కథ విషయంలో ఆయన చాలా సమయం తీసుకుని కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక నిర్మాణ బాధ్యతలను నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. బాలయ్య ఇప్పటికే వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉండగా, కొరటాల శివతో మొదటిసారి జతకట్టడం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్ కలిస్తే ఈ సినిమా మరో భారీ హిట్‌గా నిలుస్తుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.



# చట్టం స్పోర్ట్స్

## కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు ( లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు అంతర్గత సమాచారం. బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతున్న తరుణంలో తమ ప్రధాన వికెట్ టేకింగ్ స్పిన్నర్ గాయం బారిన పడటం, అది వివాదాస్పదంగా మారడం కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి.

.........

## ఐపీఎల్ 2008 సీజన్‌లో మెరుస్తున్న కుర్రాళ్లు

ఐపీఎల్ చరిత్రలో కొందరు ఆటగాళ్లు వన్ సీజన్ వండర్స్‌లా మిగిలిపోయారు. ఒక్క సీజన్ అద్భుత ప్రదర్శన చేసి, తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నా.. ఆ తర్వాత ఫామ్ కోల్పోయి అదృశ్యమయ్యారు. అలాంటి ఆటగాళ్లపై ఓ లుక్కేద్దాం.ఐపీఎల్ 2008 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ స్వప్నిల్ అస్నోద్కర్ అసాధారణ బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో 9 మ్యాచ్‌ల్లో 311 పరుగులతో టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచాడు. సౌతాఫ్రికా ప్లేయర్ గ్రేమ్ స్మిత్‌తో కలిసి అదిరిపోయే ఆరంభాలు అందించి రాజస్థాన్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ, ఆ తర్వాత మూడు సీజన్లలో దారుణంగా విఫలమై కనుమరుగయ్యాడు.కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ప్లేయర్ పాల్ వాల్తాటీ కూడా ఒక్క సీజన్‌లోనే మెరిసాడు. 2011లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 63 బంతుల్లో 123 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో యశస్వి జైస్వాల్ ఆ రికార్డ్ బద్దలు కొట్టేవరకు ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసి అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా వాల్తాటీ కొనసాగాడు. ఈ సెంచరీ తర్వాత.. డెక్కన్ ఛార్జర్స్‌పై 75 పరుగులతో పాటు నాలుగు వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రదర్శనతో పంజాబ్ జట్టులోకి వచ్చిన వాల్తాటీ.. ఐపీఎల్ 2011 సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 463 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2012



సీజన్‌లో మణికట్టు గాయంతో ఫామ్ కోల్పోయిన వాల్తాటీ ఆ తర్వాత కనురుగయ్యాడు. కేకేఆర్ ప్లేయర్ మన్విందర్ బిస్లా కూడా ఐపీఎల్ 2012 సీజన్‌లో దుమ్మురేపి ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. ఐపీఎల్ 2012 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి కేకేఆర్ టైటిల్ గెలవడంతో మన్విందర్ కీలక పాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో ఏడు మ్యాచ్‌ల్లో 213 పరుగులు చేసిన మన్విందర్ బిస్లా.. ఫైనల్లో 48 బంతుల్లో 89 పరుగులు చేసి కేకేఆర్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఐపీఎల్ ఫైనల్లో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా రికార్డు సాధించాడు. ఇప్పటి ఈ రికార్డ్ చెక్కుచెదరకుండా ఉంది. కానీ ఆ తర్వాత అతను ఆ జోరు కొనసాగించలేక ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 41 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన ప్రవీణ్ తాంబే.. అతిపెద్ద వయస్కుడైన ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. ఎలాంటి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం లేని అతన్ని రాహుల్ ద్రవిడ్ గుర్తించి అవకాశం కల్పించాడు. డీవై పాటిల్ మైదానంలో సంధాన అధికారిగా పనిచేసిన తాంబే.. అక్కడి మ్యాచ్‌ల్లో బ్యాటర్లను ఇబ్బంది పెట్టి రాజస్థాన్ స్కౌట్స్‌ను ఆకట్టుకున్నాడు. 2013 మే 7న ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత, 2014 మే 5న, 42 ఏళ్ల వయస్సులో, తాంబే మోతెరా మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై హ్యాట్రిక్ తీసి తన జట్టుకు 10 పరుగుల విజయాన్ని అందించాడు. ఆ సీజన్‌లో 13 మ్యాచ్‌లలో మొత్తం 15 వికెట్లు పడగొట్టాడు. గుజరాత్ లయన్స్, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి పలు జట్ల తరఫున ఆడిన తాంబే, తన ఐపీఎల్ కెరీర్‌లో మొత్తం 33 మ్యాచ్‌లలో 30.5 సగటుతో 28 వికెట్లు తీశాడు. 2019 వేలంలో ?20 లక్షలకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసినప్పుడు, 48 ఏళ్ల వయస్సులో వేలంలోకి వచ్చిన అతి పెద్ద ఆటగాడు ఇతనే. అయితే, దుబాయ్‌లో జరిగిన టీ10 లీగ్‌లో ఆడినందుకు 2020 ఐపీఎల్ నుంచి బీసీసీఐ అనర్హుడిగా ప్రకటించింది. ఆ తర్వాత భారత క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడాడు. ప్రవీణ్ తాంబే జీవిత కథ ఆధారంగా సినిమా కూడా వచ్చింది. ఐపీఎల్ 2020 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున రాహుల్ తెవాటియా మెరుపు బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆఖరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్సర్లు కొట్టి సంచలన విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో ఒక దశలో 19 బంతుల్లో 8 పరుగులే చేసిన తెవాటియా.. షెల్డన్ కాట్రెల్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్స్‌లు బాది టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచాడు. ఆ సీజన్‌లో రాహుల్ తెవాటియా..255 పరుగులతో పాటు 10 వికెట్లు పడగొట్టాడు.ఐపీఎల్ 2022లో గుజరాత్ టైటాన్స్ జట్టు అతన్ని రూ.9 కోట్లకు కొనుగోలు చేయడంతో అతని విలువ మరింత పెరిగింది. ఆ సీజన్‌లోనూ రాహుల్ తెవాటియా సత్తా చాటాడు. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆఖరి రెండు బంతుల్లో రెండు సిక్సర్లు బాది సంచలన విజయాన్ని అందించాడు. కానీ గత మూడు సీజన్లుగా అతని ప్రదర్శన మరీ దారుణంగా పడిపోయింది.

## చరిత్ర సృష్టించిన జనిక్ సినర్

### ఇటాలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవ

ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఇటాలియన్ ఓపెన్ టైటిల్?ను కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో తాజాగా జరిగిన ఫైనల్?లో ప్రపంచ నంబర్ వన్ సినర్, నార్వేకు చెందిన కాస్పర్ రూడ్‌ను 6-4, 6-4 తేడాతో వరుస సెట్లలో ఓడించాడు. దీంతో గత 50 ఏళ్లలో ఇటాలియన్ ఓపెన్ గెలిచిన తొలి ఇటలీ పురుష ఆటగాడిగా సినర్ రికార్డు కొట్టాడు. చివరిసారిగా 1976లో ఇటలీ ఆటగాడు అడ్రియానో పనట్టా ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక టైటిల్ గెలిచిన అనంతరం సిన్నర్ మాట్లాడుతూ "ఈ ట్రోఫీ 50 ఏళ్ల తర్వాత ఇటలీకి తిరిగి వచ్చింది. ఇది నాకు, యావత్ దేశానికి ఎంతో ప్రత్యేకమైన క్షణం" అని వ్యాఖ్యానించాడు.రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్‌గా నిలిచిన కాస్పర్ ఈ ఫైనల్?లో సినర్?కు గట్టి సవాల్ విసిరాడు. మ్యాచ్‌లో అద్భుతమైన ఆరంభం చేసి, తొలుత ఆధిక్యం సాధించాడు. అయితే కరెక్ట్ టైమ్?లో సినర్ కమ్?బ్యాక్ ఇచ్చాడు. మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధిస్తూ, లీడ్?లోకి



దూసుకెళ్లాడు. అదే ఆధిక్యం కొనసాగిస్తూ మ్యాచ్?లో విజేతగా నిలిచాడు. అయితే మ్యాచ్ అనంతరం రూడ్ మాట్లాడుతూ "ఈ ఏడాది నువ్వు సాధిస్తున్న విజయాలను వర్ణించడం కష్టం. చరిత్ర సృష్టించినందుకు అభినందనలు" అని సినర్?కు శుభాకాంక్షలు తెలిపాడు. కాగా, కాస్పర్ రూడ్?పై సినర్? 5-0 'హెడ్-టు-హెడ్' రికార్డుతో లీడ్?లో ఉన్నాడు. సినర్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా తన 29వ మ్యాచ్ గెలిచాడు. దీంతో ఈ ఏడాది క్లే కోర్టులలో తన రికార్డును 17-0 మెరుగుపర్చుకున్నాడు. ఇక ఇప్పుడు అందరి దృష్టి వచ్చే వారం ప్రారంభం కానున్న ఫ్రెంచ్ ఓపెన్‌పైనే ఉంది. ఆ టోర్నీలో సినర్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగనున్నాడు. కెరీర్?లో అనేక రికార్డులు సాధిస్తున్న సినర్?కు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ మాత్రం ఇప్పటిదాకా అందలేదు. గతేడాది ఫైనల్? దాకా వెళ్లినా, కర్లోస్ అల్కరాస్ చేతిలో ఓడిపోయి రన్నరప్?గా నిలిచాడు. దీంతో ఈసారి ఎలాగైనా ఈ గ్రాండ్ స్లామ్ నెగ్గాలని భావిస్తున్నాడు. పురుషుల డబుల్స్ టైటిల్ కూడా ఇటలీనేక కైవసం చేసుకుంది. ఈ విభాగంలో సిమోనే బెలోలి - ఆండ్రియా వావసోరి జోడీ పురుషుల డబుల్స్ ఫైనల్స్?లో విజేతగా నిలిచింది. ఈ జోడీ మార్సెల్ గ్రానోలర్స్- హొరాసియో జిబాల్లోస్?పై 7-6 (8), 6-7 (3), 10-3 స్కోరుతో నెగ్గింది. ఒకే రోజు ఇలా రెండు విభాగాల్లో టైటిళ్లు దక్కించుకోవడంతో ఇటలీకి ఇది చిరస్మరణీయ సందర్భంగా మారింది. కాగా, 1960 తర్వాత రోమ్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఒక ఇటాలియన్ జోడీ గెలుచుకోవడం ఇదే మొదటిసారి.

## ధోని ఫ్యాన్స్‌కు మరోసారి నిరాశ



ఐపీఎల్ 2026లో భాగంగా నేడు మరో హై వోల్టేట్ మ్యాచ్ జరుగుతోంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సీఎస్కే తలపడుతోంది. ఇక టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే సీఎస్కే అభిమానులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. ఎంఎస్ ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని కెప్టెన్ రుతురాజ్ స్పష్టం చేశాడు. ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్లే ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని రుతురాజ్ తెలిపాడు. ఈ రోజు తాము గెలుస్తామని, తదుపరి మ్యాచ్‌కు ధోనీ కోలుకుని తిరిగి జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు కెప్టెన్ పేర్కొన్నాడు.

ఈ క్రమంలో ధోనీ టీ20 రిటైర్మెంట్?కు సంబంధించిన వీడియో వైరల్?గా మారింది. అయితే చెన్నై చేపాక్ వేదికగా జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్?లో బరిలోకి దిగి సొంత అభిమానుల ముందు ధోనీ ఐపీఎల్?కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనీ మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో ధోనీ 'చెన్నైలోనే నా ఆఖరి టీ20 మ్యాచ్ ఉంటుంది' అని అన్నాడు. దీంతో అది నిజం కానుందని అంటున్నారు. 'పక్కా ప్లానింగ్?తోనే నా క్రికెట్ కెరీర్?ను ఉంటుంది. ఇంటర్నేషనల్ లెవెల్?లో నా చివరి మ్యాచ్ రాంచీలో ఆడాను. అలాగే ఆఖరి టీ20 మ్యాచ్?ను చెన్నైలోనే ఆడతాను కావొచ్చు. అది ఇప్పుడేనా లేదా ఐదేళ్ల తర్వాతనా? అనేది చెప్పలేను!'అని ధోనీ 2021లో సీఎస్కే ఫ్రాంచైజీ నిర్వహించిన ఈవెంట్?లో అన్నాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది.ఇదిలా ఉండగా, ధోనీకి సంబంధించిన ఒక కొత్త వీడియో సైతం నెట్టింట వైరల్?గా మారింది. అందులో ధోనీ ఎన్?ఎస్?జీ కమాండర్స్?తో మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ఫుడ్ ప్లేట్ చేతిలో పట్టుకొని ఉన్న ధోనీ అందులో 'నేను ఫిట్?గా కనిపిస్తున్నానా?' అని ఎన్?ఎస్?జీ కమాండర్?ను నవ్వుతూ అడుగుతాడు. దీంతో తాను ఫిట్?గానే ఉన్నానని ఇలా ఫ్యాన్స్?కు చెప్పాడని, రిటైర్మెంట్?లాంటివి ఏమీ లేవని హింట్ ఇచ్చాడంటూ ఫ్యాన్స్? వాదిస్తున్నారు. ? అయితే సన్?రైజర్స్?తో సోమవారం చెన్నై వేదికగానే మ్యాచ్ ఉంది. ఈ సీజన్?లో సీఎస్కేకు ఇదే హోం గ్రౌండ్?లో లాస్ట్ మ్యాచ్. దీంతో ధోనీ గతంలో చెప్పిన రిటైర్మెంట్ టైమ్ ఇప్పుడే వచ్చేసిందా? అంటే నెటిజన్లు ఔను అనే అంటున్నారు. ప్రస్తుతం 44ఏళ్లు ఉన్న ధోనీ వచ్చే సీజన్?దాకా ఫిట్?నెస్ కాపాడుకోగలడా? అనేది కచ్చితంగా చెప్పలేం. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి కూడా సడెన్?గా వీడ్కోలు చెప్పి అందర్నీ షాక్?కు గురి చేసిన తలా ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకొని మరోసారి అభిమానులకు షాక్ ఇస్తాడా? అనేది వేచి చూడాలి!

## రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు



ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు దుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు.రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా.." అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు.రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. "డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా? అది గొప్ప నిర్ణయం కాదు, అనవసరం.. అని వాన్ అన్నారు.

### ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ ఆశలు సజీవం



ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసి 4 బాల్స్ మిగిలి ఉండగానే ఛేజ్ చేసి గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశి 21 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్సులు కొట్టి 46 పరుగులు చేశాడు. కెప్టెన్ రియాన్ పరాగ్ 26 బాల్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సులతో 51 రన్స్ చేశాడు. ధ్రువ్ జురెల్ 40 బాల్స్‌లో 53 రన్స్ సాధించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ లోని మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి రాజస్థాన్ మ్యాచ్‌ను తిప్పికొట్టాడు. అతను 14.2వ ఓవర్‌లో పరాగ్, 14.3లో డోనవన్ ఫెరీరా, 14.5లో రవి సింగ్ వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్‌లాంటి ప్రదర్శన చేశాడు. లుంగి ఎన్‌గిడి 2 వికెట్లు, మధవ్ తివారి 2 వికెట్లు సాధించారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ధమాల్ అంది. ఢిల్లీ ఛేజ్‌లో అభిషేక్ పోరెల్ 31 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 51 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 42 బాల్స్‌లో 1 ఫోరు, 3 సిక్సులు కొట్టి 56 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చారు. కెప్టెన్ అక్సర్ పటేల్ 19 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇతరులు కీలక సహకారం అందించారు. జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసినా ఢిల్లీ స్థిరంగా ఛేజ్ పూర్తి చేసింది. అశుతోష్ శర్మ చివరి ఓవర్లలో సిక్స్‌తో మ్యాచ్‌ని ముగించాడని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. అక్సర్ పటేల్ (ఢిల్లీ) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, కానీ స్టార్క్ లాంటి బౌలర్లు డెత్ ఓవర్లలో ప్రభావం చూపారు. వాతావరణం హాట్ ఢ డ్రైగా కనిపించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచుల్లో 6 విన్నింగ్స్‌తో 12 పాయింట్లు సాధించి 7వ స్థానంలో ఉంది. రన్ రేట్ -0.871. రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. ఈ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి 6 గెలిచింది. రాజస్థాన్ బ్యాటింగ్ ఆరంభంలో బాగుంది కానీ మిడిల్ ఓవర్లలో.. స్టార్క్ స్టార్మ్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తియ్యడం వల్ల చిక్కుల్లో పడింది. ఢిల్లీ బ్యాటింగ్ డెప్త్, ఫినిషింగ్ సామర్థ్యం గెలుపును తెచ్చిపెట్టాయి. రెండు జట్ల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది. ఇది సీజన్‌లో కీలక మ్యాచ్‌లలో ఒకటి. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ కూడా ఆటను ప్రభావితం చేసిందని ఎన్డీటీవీ స్పోర్ట్స్ రిపోర్ట్ చేసింది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999